# సతీమణి

బులుసు సీతారామమూర్తిగారు

రామారావుగారు బందరులో ఒక గొప్ప న్యాయవాది. చిన్నతనమునుండియు పవిత్రాంతఃకరణమును, విద్యాధిక్యతయు, నందులకుఁదగు వినయము, దీనరక్షాపరతంత్రత, ఉన్నత సంస్కరణాభిలాషయు, భూషణములై నెగడొందు న్యాయవాదివృత్తిచే విశేషము ధనమార్జించి కీర్తిగడించెను. ఆయనకు లేకలేక చిరకాలమున కనేక నోముల ఫలముగా కృష్ణుడను నొకపుత్రుఁడును, శారదయను నొకపుత్రికయుఁగల్గి రూప విద్యాశీలముల వృద్ధినొందుచుండిరి. క్రమముగ నామెకు పదునైదువర్షముల వయస్సు వచ్చినది. రామారావుగారు యింటఁ దల్లి పోరుపడలేక రాజమండ్రిలో బి. యే. చదువుచున్న విశ్వేశ్వరరావునకిచ్చి వివాహ మతి వైభవమున నొనరించెను.

* * *

ఆహా దైవమహిమ! తానొకటిఁదలఁచిన దైవమొండుఁ దలఁచును. సంపూర్ణ విద్యావతియు జవ్వనియునై యుండి ప్రాణేశుఁడగు విశ్వేశ్వరునితో సకలసుఖముల ననుభవించుచుపవిత్రాశయపూరితమగు గృహిణీధర్మము ననుష్ఠింపఁదలచినశారదాదేవి యిట్టిదుర్వార్త వినవలసివచ్చునని కలనైన నెవరునుఁ దలఁప లేదుకదా! "పోస్టుజవా"నిచ్చిన వుత్తరము జూచికొని కొంతసేపు నిశ్చేష్టులై యుండి యాలేఖను కోటుజేబులోనుంచి రామారావుగారెచటికో వెడలిరి. యీవిషయముఁ గని పెట్టుచున్న శారద యాలేఖఁగైకొని యిట్లు చదువుకొనెను.

శ్రీశ్రీశ్రీ రామారావు బావగారికి-

మీఅల్లుఁడు చిరంజీవి విశ్వేశ్వరుఁడు రెండువత్సరములనుండీ దుర్వ్యసనలోలుఁడై తనవంతుయావదాస్తిని వెచ్చించియున్నాడు. ఇపుడు నాయాస్తిఁగూడ నపహరించి వేశ్యల కీదలఁచి నన్ననేకవిధములనడిగి విఫలుడై నిన్నరాత్రి 12 గంటలకు నన్ను కత్తితో బొడిచి పలాయనమాయెను. నాకు కాలము సమీపించినది. యిఁకఁ బ్రతుకజాల. సతీమణియగు శారదకిట్టి యిక్కట్టు కలుగుటకు కారణము నేనేగదాయను చింతతో ప్రాణముల వీడుచున్నాను. శారదకు శుభమగుగాక

ఇట్లు క్షంతవ్యుఁడు
నారాయణరావు.

యిన్నీసుపేట, రాజమండ్రి.
15—5—1795

ఆలేఖాపఠనానంతర మామెకు గలిగిన విచారభారము వర్ణింప నాదిశేషునకైనఁ దరముగాదన నాశ్చర్యమేమి? లేఖను యథాస్థానమునుంచి తనపఠనమందిరమున కేగెను.

* * *

రామారావుగారు 'శారదా! యేల మమ్మింత దుఃఖసాగరమున ముంచెదవు, విశ్వేశ్వరుఁడదృశ్యుఁడై యిప్పటికి అరువత్సరములపూర్వము. నేటికి నతనిజాడ తెలియదు గదా! మూఁడువత్సరములపూర్వము విజయనగరమున క్షయవ్యాధిచే బాధపడుచుండెననియు కొద్దిదినములఁ జావనున్నాఁడనియుఁ దెలిసి విజయనగరప్రాంతముల గాలించి విఫలుఁడనైన విషయము విదితమేకదా!

నీతోఁడి సంస్కర్త్రి వనితలందరు నీశీలముఁ గొనియాడుచు నీకువ్రాసిన లేఖ ద్రోసి నీవిషయమై కృశించి మంచముపట్టిన తల్లి మాట సరకుగొనక నీకై పలువిధముల పరితపించుచున్న నాప్రార్థన దిరస్కరించి యారక ఉపవాసముల నేల శుష్కించెదు. ఆపితృహంతకుడు జారుడు మూర్ఖుఁడు!! వాని నామము రాత్రింబవళ్లేమరక స్మరించిన నేమి ఫలము యిదితప్పిన నాయాన కలదుసుమా!! నామాటవిని నానిశ్చయించిన వరుఁగూడి మా కమందానందము కలిగింపుము' అని దీనముగా బలికెను. "తండ్రీ యీవిషయములో మీవాక్యములఁ ద్రోచివుచ్చినందులకు మన్నింపవలయును. తండ్రీ, నిర్మలహృదయమును పవిత్రప్రేమతో విష్ణుస్వరూపునిగా భావించి యాతనికర్పించియుంటినే, అట్టి హృదయమును నేనెట్లు మరల్చుదును. నా తరముగాదు. జయంతకంతులుగాని మన్మథుడుగాని ప్రత్యక్షముగావచ్చి యాచించినను నామానసము చలన మొందునది కాదు. మూర్ఖుడైనను కురూపియైనను వ్యాధితుఁడైనను భర్తను విష్ణునిగా భావించుటపాడి. నాపతి ననేకవిధముల నెందుకు నిందించెదవు. పూర్వజన్మమున నేమిథునమునో నేనెడఁబాపియుండిన నాపాపమునకు పాత్రులెవ్వరు? మనోవాక్కాయకర్మముల భారవోసి దైవవశమున భర్త విపరీతుఁడైన విస్మృతింబొందు నదియా ప్రేమ!! తండ్రీ, వేయేల? నానియమానుసారముగ నారువత్సరముల కొక మాసము గడువు మిగిలియున్నది. యీలోగా నాభర్తజాడ దెలియనిచో హిమవత్పర్వతమునకుబోయి తపస్సుచేసి పరజన్మనైన నను నాపతిని సచ్ఛీలుని జేసి ననుగూర్చుమని దైవముఁ బ్రార్థించెద. ఇదియే నిశ్చయముఁ నిశ్చయము!!"అని శారదయనెను. ఇంతలో 'పోస్టుజవాను' జాబునిచ్చి వెడలిపోవును. రామారావుచూచి జాబు నిట్లు చదువును:—

తరుణీమణీ శారదా!

పశ్చాత్తప్తుఁడనై ధనాశాపిశాచావేశితుడనై తండ్రినిఁ బలికి నీయెడ మహాపరాధమొనర్చితిని. క్షయవ్యాధిపీడితుడనై యున్నాను. కొద్దికాలములో మరణింపనున్నాడను. అంత్యమున నొకసారి దర్శనమిచ్చి రక్షింపుము. క్షమింపుము. ఆర్యాపురం ఏటిఒడ్డున పాకలో నున్నాను.

ఇట్లు క్షంతవ్యుడు,
విశ్వేశ్వరుఁడు,

రాజమండ్రీ
14—5—1800

శారదకు ఆనందాశ్రువులు ముత్తియముల పగిది జలజలరాలెను.

మర్నాడు 10 గంటలకు శారదారామారావుగార్లు ఆర్యాపురం పాకసమీపించిరి. దూరమునకు దుర్వాసన విరజిమ్ముచు ఈగల దోలుట కసమర్థుడై పశ్చాత్తాపముతో అసంపూర్ణముగ రామనామముచ్చరించెను. ఆశారద విశాలహృదయ మెట్టిదోకాని ఆవిశ్వేశ్వరుడు నవయౌవన సుందరాకారుడై యామెకు కన్పట్టెను. ఆమెంజూచి యాతని క్షమింపుమని దీనముగఁబల్కెను. వెంటనే యామె హృదయాంతరాళము తరంగితమగుచున్న పవిత్రప్రేమ యుప్పొంగ ప్రాణేశ్వరాయని కౌగలించుకొనెను.

ప్రేమయన నదియేకదా! ధనయౌవనాదులు కల్గినాడు పైపై వన్నెల్పచరించి లేనినాడు వానినివదలి మఱియొకని నన్వేషించు కులటల చిత్తములలో మిరా కెంత మాత్రమయిన తావున్నదా? 'శారదా నీవు ధన్యవు' ఇట్టినారీమణులు భారతదేశమున నింకెందరో కలరు!!

వినుము మనోవాక్కాయము
లన మూఁడు దెఱఁగు; లందు సతికిఁ గరణం
బనఘ, ప్రధానము గావున
మనమునఁ గైకొన్నభర్త మానందగునే.

భారతము

సావిత్రి

290